క్లుప్తంగా

ధర్మ నిధి సేకరణకు స్వచ్ఛంద సహకారం అవసరం



కొల్లూరు : హిందూ ధర్మ రక్షణ కోసం ధర్మ నిధి సేకరణకు స్వచ్ఛంద సహకారం అవసరమని జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు అన్నారు. సోమవారం మండలంలోని చినపులివర్రు, వేమూరు మండలంలోని పెరవలి, పెరవలిపాలెం గ్రామాలలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా కన్వీనర్‌లు ధర్మ నిధి సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందువులు అన్య మతాలు స్వీకరించకుండా హిందూ ధర్మం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని అన్నారు. హిందూ ధర్మ రక్షణ కోసం సమరసత సేవా ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్లు మండల రాజకుమారి, సవరాల మాధవి, కూచిభట్ల లక్ష్మిగాయత్రి, మల్లేశ్వరి, చవ్వాకుల శాంతికుమారి, గోగిశెట్టి సతీష్‌నాయుడు, గాజుల శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ కోశాధికారి ప్రభాకరరావు అస్తమయం



రేపల్లె రూరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ కోశాధికారి అడుసుమల్లి ప్రభాకరరావు (65) పట్టణంలోని ఆయన స్వగృహంలో సోమవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన రెడ్‌క్రాస్ సొసైటీతో పాటు పలు స్వచ్ఛంద సేవా సంస్థల్లో సభ్యునిగా పనిచేస్తూ సామాజిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే వారు. బాల్య వివాహాల నివారణకు గ్రామీణ ప్రాంతాలలో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మృతిపట్ల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, పలు సేవా సంఘాల సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన భార్య గతంలో రహదారి ప్రమాదంలో మృతి చెందారు. ప్రభాకరరావుకు ఇరువురు కుమారులు ఉన్నారు.

నేడు బాలకోటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

అమర్తలూరు(వేమూరు): గోవాడ గ్రామంలో వేంచేసి ఉన్న బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో జరగబోవు మహా శివరాత్రి తిరునాళ్ల సందర్భంగా మంగళవారం సాయంత్రం 7 గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి.అశోక్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది శివరాత్రి రోజున కల్యాణం నిర్వహించడం జరుగుతుందని, కానీ ఈ ఏడాది శివరాత్రికి 15 రోజుల ముందు స్వామి వారి కల్యాణం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కల్యాణంలో గోవాడకు చెందిన పావులూరు రమేష్ దంపతులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా పావులూరు రమేష్ స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. భక్తులందరు కళ్యాణ మహోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

ప్రకృతి ఉత్పత్తులతో ఆరోగ్యం



కర్లపాలెం: ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పండించిన పంటల ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవటం వలన ఆరోగ్యంగా ఉంటారని ప్రకృతి వ్యవసాయం బుద్ధాం కో ఆర్డినేటర్ సత్యనారాయణ తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన సామలు, కొర్రలు, అరికలు, ఊదలు వంటి సిరిధాన్యాలతో పాటు కూరగాయలు, ఆకు కూరలను సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విక్రయించారు. కో ఆర్డినేటర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రవిశంకర్, నందిని, తిరుపతమ్మ, భారతి తదితరులు ఉన్నారు.

వాహన, హోమ శాలల నిర్మాణానికి శంకుస్థాపన

చందోలు(కర్లపాలెం): లింగోద్భవస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా సోమవారం శంకుస్థాపన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో చందోలు గ్రామంలో వేంచేసియున్న లింగోద్భవ స్వామి దేవస్థానంలో విజయవాడకు చెందిన భక్తులు కొత్త శ్రీనివాసరావు దంపతులు, రేపల్లెకు చెందిన సనక రఘువంశీ దంపతులు హోమశాల, వాహనశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చెన్నకేశవస్వామి వారి దేవస్థానంలో తెనాలికి చెందిన చుక్కపల్లి రఘునాధబాబు దంపతులు హోమశాల, వాహనశాల శంకుస్థాపన పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దండిబొట్ల జానకిరామ్, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసశాస్త్రి, నరసింహమూర్తి శర్మ, కృష్ణమాచార్యులు, వరదాచార్యులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



దోస రైతు దిగాలు

- తెగుళ్లు, ఇంకిపోతున్న దొరువులతో ఇబ్బందులు
- కష్టం రైతులది.. సొమ్ము దళారులది
- కలగానే మిగిలిన రైతు బజార్లు



పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతులు

బాపట్ల: పుడమిని నమ్ముకొని జీవనం సాగించే అన్నదాత వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆకలితో అలమటించే పరిస్థితి నెలకొంది. వరుణుడు కరుణించకపోవడం, కాలువల ద్వారా నీళ్లు లేకపోవడంతో కళ్లెదుటే ఎండిపోతున్న పైర్లను ఎలా కాపాడుకోవాలో తెలియక రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇదిలా ఉండగా మొక్కజొన్న, మినుము, వేరుశనగ సాగు చేయటానికి సాగునీరు వచ్చే అవకాశం లేకపోవడంతో రబీ పంటగా కనీసం దోస తోటలైనా ఆశాజనకంగా ఉంటాయనే ఆశతో మండలంలోని పిన్నిబోయినవారిపాలెం, వల్లువారిపాలెం, నందిరాజుతోట, కొండుబోట్లవారిపాలెం, గులాంహుస్సేన్‌తోట, మహాత్మాజీపురం, మరుప్రోలువారిపాలెం, దరివాదకొత్తపాలెం, హైదరపేట తదితర గ్రామాల్లో సుమారు 250 ఎకరాల్లో దోస తోటలకు శ్రీకారం చుట్టారు. అయితే దోస విత్తనాలు నాటినప్పటి నుంచి రైతులు కష్టాలను ఎదుర్కొంటూనే ఉన్నారు.

పొలం వద్దనే కాపలా

వర్షాభావ పరిస్థితుల కారణంగా భూమిలో తేమ శాతం తగ్గి భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటి పోతున్నాయి. దీంతో ఎకరంలో రూ.3,000 వెచ్చించి మూడు దొరువులు ఏర్పాటు చేసినప్పటికీ భానుడి తాపానికి ఎండిపోతున్నాయి. పొలాన్ని తడిపేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక వైపు చల్లడం, కాసేపు కూర్చొని దొరువులో నీళ్లు ఊరిన తర్వాత మరలా చల్లడం చేస్తూ రోజంతా పొలం వద్దనే కాపలా కాస్తున్నారు. దీనికి తోడు తెగుళ్లు కూడా ఉధృతంగా వ్యాపిస్తున్నాయి. దీంతో పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియక రైతులు అల్లాడిపోతున్నారు.

సాగు కష్టతరంగా ఉంది

ఈ ఏడాది దోస తోటలు సాగు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నీళ్లు చల్లి ఇంటికి భోజనానికి వెళ్లి వచ్చేసరికి పొలం ఎండిపోతుంది. మరలా చల్లుదామంటే దొరువులో నీళ్లు ఉండటం లేదు. గతంలో ఎన్నడూ ఈ కష్టాలు చూడలేదు.

– అద్దంకి సాంబశివరావు

8 వారాలు..రూ.24 వేలు

దోస తోటలను సాగుచేసేందుకు వారానికి రూ.3 వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఎరువులు 20–20–0–15, అమ్మోనియా కొనుగోలు రూ.1,750, పురుగు మందులు కొనుగోలు, పిచికారీ ఖర్చులు రూ.1,250, ఎకరానికి రూ.3000 చొప్పున 8 వారాల పాటు రూ.24 వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది.

– కోసూరి వెంకటరమణ

కష్టపడినా ప్రయోజనం లేదు

రెండు నెలల పాటు కంటికి రెప్పలా కాపాడుకుంటూ పైర్లను సాగు చేసినప్పటికీ ప్రయోజనం ఉండటం లేదు. రైతు బజార్లు లేకపోవడం వలన మేము దళారులకు కేజి రూ.5 చొప్పున 50 కేజిల టిక్కిను రూ.250కు విక్రయిస్తున్నాం. వాళ్లు మార్కెట్‌లో రూ.1,500 విక్రయించుకుంటున్నారు.

– అసోది అంకిరెడ్డి, అసోదివారిపాలెం

రైతు బజార్లు ఏర్పాటు చేయాలి

ఒక ఎకరం దోస తోట సాగుకు కేజీ విత్తనాలకు రూ.2,400, దొరువులు వేసినందుకు రూ.3,000, నీళ్లు పెట్టినందుకు రోజుకు ఇద్దరు కూలీలకు రూ.600 చొప్పున రెండు నెలలకు రూ.36,000, పాదులు చేసినందుకు రూ.2,000, పశువుల ఎరువు రూ.1,500, ఎరువును పాదుల్లో పోసినందుకు రూ.1,000, పాదుల మధ్యలో నేలను తిరగవేసినందుకు రూ.1,000, దుక్కి దున్నినందుకు రూ.2,000, వారానికి ఒకసారి ఎరువులు వేసినందుకు రూ.1,750, పురుగు మందులు పిచికారీకి రూ.1,200 చొప్పున ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇదిలా ఉండగా పంట వచ్చిన తర్వాత దళారులు కేజి రూ.5 చొప్పున 50 కేజీల టిక్కి రూ.250కు కొనుగోలు చేసి మార్కెట్‌లో కేజి రూ.30 చొప్పున 50 కేజిల టిక్కి రూ.1,500కు విక్రయిస్తున్నారు. రైతు బజార్లు ఏర్పాటు చేస్తే పండించిన పంటలను రైతులే నేరుగా విక్రయించుకునే అవకాశం ఉంటుందని గత కొన్నేళ్లగా రైతులు పాలకులు, అధికారులకు అనేక పర్యాయాలు విన్నవించుకున్నా ప్రయోజనం లేదు.



ఎండిపోతున్న దోస తోటలు

మహిళలకు హోమ్ కంపోస్ట్ తయారీపై అవగాహన కల్పించాలి

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు



ఆర్‌పీలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

రేపల్లె రూరల్: గృహాల నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలతో కంపోస్ట్ ఎరువు తయారు చేసి వాటిని వినియోగించుకునే విధానంపై ప్రతి ఒక్కరిలో ముఖ్యంగా మహిళల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత మెప్మా ఆర్‌పీలదేనని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు తెలిపారు. హోమ్ కంపోస్ట్‌పై పట్టణంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మెప్మా ఆర్‌పీలకు సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గృహాల నుంచి వచ్చే వ్యర్థాలను ముందుగా తడి, పొడి చెత్తలుగా వేరు చేయాలన్నారు. తడి చెత్తను కంపోస్ట్‌గా తయారు చేసి ఇంట్లో పెంచుకునే మొక్కలకు వేస్తే భూసారం పెరగటమే కాకుండా మొక్కలు ఆరోగ్యవంతంగా పెరుగుతాయన్నారు. పెరటి మొక్కలకు వినియోగించగా మిగిలిన కంపోస్ట్‌ను విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. డంపింగ్ యార్డుకు చెత్తను తరలించే పరిమాణం తగ్గుతుందన్నారు. ఆయా అంశాలను మహిళలకు తెలియజేసి చైతన్య పరచాలని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం మెరుగు

అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో మాత్రలు పంపిణీ

కొల్లూరు : అనారోగ్య సమస్యలకు మూల కారణమైన నులిపురుగుల నివారణతో ఆరోగ్యం మెరుగుపడుతుందని కొల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి కావ్య అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు బాలబాలికలకు నులిపురుగుల నిర్మూలన మాత్రల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పీహెచ్‌సీ పరిధిలోని సబ్ సెంటర్ల పరిధిలో ఉన్న 5,500 మందికి మాత్రలు పంపిణీ చేయాల్సి ఉండగా తొలిరోజు 5,100 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో గైర్హాజరైన విద్యార్థులకు తిరిగి ఈ నెల 17న మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. నులిపురుగుల బారిన పడితే మందకొడి తనం, రక్తహీనతకు గురై నీరసించే పోయే ప్రమాదం ఉందన్నారు. నులిపురుగుల నివారణకు బహిరంగ మల విసర్జన చేయరాదని, పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు, వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.నరసింహారావు పాల్గొన్నారు.



కొల్లూరులో విద్యార్థినికి నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న వైద్యాధికారి కావ్య



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ గోపీనాథ్



విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న ఎంపీడీఓ రమణ

నులిపురుగుల నివారణపై దృష్టి సారించాలి

భట్టిప్రోలు (కొల్లూరు): నులిపురుగుల నివారణపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎస్వీ రమణ అన్నారు. సోమవారం భట్టిప్రోలులో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమె బీఆర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులకు మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏడాది వయస్సు ఉన్న చిన్నారుల నుంచి 19 ఏళ్ల వయస్సున్న యువతీ యువకులు నులిపురుగుల కారణంగా అనారోగ్యాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


కర్లపాలెం: విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చక్కగా చదవగలుగుతారని జిల్లా మలేరియా అధికారి, కర్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ఎం.గోపీనాథ్ చెప్పారు. కర్లపాలెం ప్రాథమిక పాఠశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు భోజనం చేసే ముందు చేతులు సోప్‌తో శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఇ.పోలీస్ రావు, సీహెచ్‌వో మీరమ్మ, సూపర్‌వైజర్ ఇసాక్, ఆరోగ్య సిబ్బంది విద్యార్థులు ఉన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల ద్వారా నివారణ

వేమూరు: పిల్లల కడుపులో ఉండే నులి పురుగులను ఆల్బెండజోల్ మాత్రల ద్వారా నివారించడం జరుగుతుందని మండల ప్రాథమిక వైద్యాధికారి వెంకట సురేష్ తెలిపారు. వేమూరు మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది ఫిబ్రవరి 10న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు నులి పురుగుల మాత్రలను వేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 1,550 మందికి, ఉన్నత పాఠశాలల్లో 2,900 మందికి, జూనియర్ కళాశాలల్లో 90 మందికి వేయడం జరిగిందని, మిగిలిన పిల్లలకు ఈ నెల 17న వేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. పిల్లలకు కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం, రక్తహీనత ఏర్పడి నీరసంగా ఉంటారన్నారు. ఏడాది నుంచి రెండేళ్ల పిల్లలకు ఆల్బెండజోల్ అర మాత్ర, 2 నుంచి 19 సంవత్సరాలు నిండిన పిల్లలకు పూర్తి మాత్ర వేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

కూచినపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి నాగార్జున



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కూచినపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి నాగార్జున

నిజాంపట్నం: నులిపురుగుల నివారణతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కూచినపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి నాగార్జున తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని బొర్రావారిపాలెం ప్రాథమిక పాఠశాలలో కూచినపూడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. నులిపురుగులతో శరీరంలో రక్తహీనత, పోషకాహార లోపం కలుగుతుందని, తద్వారా చిన్నారుల్లో ఆకలి మందగించటం, బలహీనత, కడుపునొప్పి, వికారం, విరేచనాలు, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. చిన్నారులచే ఆహార నియమాలు పాటించటంతో పాటు ఆల్బెండజోల్ మాత్రలు మింగించటంతో నులిపురుగులను నివారించవచ్చన్నారు. మండలంలో 66 పాఠశాలలు, 40 అంగన్‌వాడీ కేంద్రాలు, ఒక గురుకుల పాఠశాలలో మాత్రలను పంపిణీ చేశామన్నారు. 98 శాతం మంది చిన్నారులకు మాత్రలు పంపిణీ చేయటం జరిగిందని, మిగిలిన వారిని గుర్తించి అందించటం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యకు నమోదు చేయించుకోవాలి

ఏఓ వి.బుష్



కొల్లూరు : ప్రభుత్వాలు అందించే పథకాలు, రాయితీలు వర్తించాలంటే సొంత భూమి ఉన్న రైతులు తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ)కు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి ఏఓ వి.బుష్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతనంగా రైతులకు ఆధార్ కార్డు తరహాలో 14 అంకెల విశిష్ట సంఖ్యను కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ సంఖ్య నమోదు చేయించుకోని రైతులకు ప్రభుత్వ పథకాలు, రాయితీలు వర్తించే అవకాశం లేనందున సొంత భూమి ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేయించుకోవాలని కోరారు. వ్యవసాయ రంగ ఆధునీకరణ (డిజిటలైజేషన్) ప్రక్రియలో భాగంగా చేపట్టిన విశిష్ట సంఖ్య నమోదుకు సొంత వ్యవసాయ భూమి కలిగిన ప్రతి రైతు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ సహాయకులు, ఎంపీఈఓలను సంప్రదించి నమోదు చేయించుకోవాలన్నారు. నమోదు ప్రక్రియకు పట్టాదారు పాస్ పుస్తకం నకలు లేని పక్షంలో 1బీ, ఆధార్ కార్డు జిరాక్స్, ఆధార్ నంబర్ లింకైన ఫోన్ అవసరమన్నారు. అదే విధంగా మండలంలోని రైతులు, కౌలు రైతులు రబీ పంట నమోదు, ఈ కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

గుండెపోటు నుంచి రక్షించేందుకే స్టెమి కార్యక్రమం

డాక్టర్ రత్నకుమారి



స్టెమి కార్యక్రమం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్లు

నగరం: గుండె పోటు నుంచి ప్రజలను రక్షించేందుకు స్టెమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రత్నకుమారి చెప్పారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం స్టెమి కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ గుండెపోటుకు గురైన వారికి గంటలోపు టెనెక్టిప్లేస్ ఇంజక్షన్ ఇవ్వడం వల్ల ప్రాణాపాయం లేకుండా చూడవచ్చన్నారు. ఈ ఇంజక్షన్‌లు గత '18 నెలల నుంచి సామాజిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. గుండెదడ, ఎడమ భుజం లాగడం, ఛాతీ నొప్పి, స్పృహ కోల్పోవడం, ఎక్కువగా చెమట పట్టడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే 108కు కాల్ చేయాలన్నారు. గుండె నొప్పికి గోల్డెన్ అవర్ చికిత్స చేసేందుకే స్టెమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్‌లు మధు ప్రభాకర్, మహేశ్వరరావు, శ్యామ్యూల్‌పాల్ ప్రదీప్, సౌమ్య, జ్ఞానచైతన్య, శాంతకుమారి, యామినిప్రియ పాల్గొన్నారు.

వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి



వాహన చోదకులకు సూచనలు ఇస్తున్న వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్నకుమారి

వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్నకుమారి

బాపట్ల: వాహనాలు నడిపేటపుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్నకుమారి పేర్కొన్నారు. బాపట్ల రవాణా అధికారి పరంధామరెడ్డి ఆదేశాల మేరకు 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను స్థానిక చీలురోడ్డు సెంటర్‌లో సోమవారం నిర్వహించారు. వాహనదారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ప్రసన్నకుమారి సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహన చోదకులు తప్పనిసరిగా అన్ని పత్రాలను వాహనంలో అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు అంకమ్మరావు, కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై పంచముఖ ఆంజనేయస్వామి



సూర్యప్రభ వాహనంపై స్వామి ఊరేగింపు

తెనాలి: పట్టణ షరాఫ్‌బజారులోని సువర్చల సమేత పంచముఖ ఆంజనేయస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు విశేషంగా కొనసాగుతున్నాయి. ఈనెల 14వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ప్రాతఃకాల సంధ్యా పూజలు చేశారు. తదుపరి సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి మంగళ వాయిద్యాల నడుమ, వేదమంత్రాలతో ప్రత్యేకంగా అలంకరించిన సూర్యప్రభ వాహనంపై పట్టణ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి ఏడు గంటలకు చంద్రప్రభ వాహన సేవ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆలయ ప్రధాన అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో, ఆర్‌వీ కిరణ్, ఆర్.సురేష్, నాగమారుతి మిత్రబృందం విశేషంగా యాగ్నిక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఉత్సవ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. విఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, మదుపల్లి చంద్రశేఖర్, జంధ్యం రామారావు గుడివాడ బాలకృష్ణ, సంకీర్తన బృందం నిర్వాహకురాలు మూర్తి అనురాధ తదితర భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ 11వ తేదీ మంగళవా రం ఉదయం తొమ్మిది గంటలకు శ్రీ మైనాక వాహ న సేవ, సాయంత్రం 6 గంటలకు శ్రీ స్వామి వారి గజవాహన సేవ, అమ్మవారి గరుడవాహన సేవ, సువర్చల హనుమత్ కల్యాణం విశేషంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణ పరిసర ప్రాంత భక్తులు కల్యాణ మహోత్సవం వేడుకల్లో పాల్గొని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి అనుగ్రహానికి పాత్రులు కావలసిందిగా కోరారు.

పన్నుల వసూలు వేగవంతం చేయాలి

తెనాలిఅర్బన్: పన్నుల వసూలను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో సోమవారం రెవెన్యూ ఉద్యోగులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి పట్టణంలో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి రోజు వారు ఉదయం సాయంత్రం బకాయిదారులను కలిసి పన్నులను వసూలు చేయాలని సూచించారు. నూటికి నూరుశాతం వసూలు చేసి ముందుస్థానంలో ఉండాలని సూచించారు. అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ నెల చివరి లోపు దాదాపు పన్నుల వసూలు పూర్తి కావాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌వో రాంప్రసాద్, పలువురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పదో తరగతి ప్రీ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం



వేమూరులో ప్రీ పబ్లిక్ పరీక్షలను పరిశీలిస్తున్న మండల విద్యాశాఖాధికారి

వేమూరు: పదో తరగతి పరీక్షలంటే విద్యార్థులకు కొంత భయం ఉంటుంది. ఆ భయాన్ని పోగొట్టి మంచి మార్కులు సాధించేందుకు పదో తరగతి విద్యార్థులకు ప్రీ పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. సోమవారం అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రీ పబ్లిక్ పరీక్షలు నిర్వహించారు. ప్రతి విద్యార్థికి పదో తరగతి కీలకం, కష్టపడి ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ మార్కులు సాధించే అవకాశం ఉంటుంది. వేమూరు నియోజకవర్గంలో వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రీ పబ్లిక్ పరీక్షలు జరిగాయి. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు మండలంలో 274, కొల్లూరు 471, అమర్తలూరు 241, చుండూరు 364, భట్టిప్రోలు 450 మంది విద్యార్థులు ప్రీ పబ్లిక్ పరీక్షలు రాశారు.